సాక్షి
జగిత్యాల
ఆదివారం । 16 । జూలై । 2023

సండే స్పెషల్

అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాలను కుదుతున్న మహిళలు





అపెరల్ పార్క్‌లోని గ్రీన్ నీడిల్ యూనిట్ ప్రవేశద్వారం

మేడిన్ సిరిసిల్ల

• రెడీమేడ్ వస్త్రాలకు కేరాఫ్ • సిరిసిల్ల నుంచి అమెరికాకు ఎగుమతులు • అపెరల్ పార్క్‌లో వస్త్రాల తయారీ • మహిళలకు మెరుగైన ఉపాధి

సిరిసిల్ల: చేస్తే బీడీలు.. లేదంటే ఖాళీగా కూర్చోవడం.. ఇది ఒకప్పటి సిరిసిల్ల ప్రాంతంలోని మహిళల పరిస్థితి. రాత్రిపగలు బీడీలు చేస్తే నెలకు రూ.3వేలు రాని రోజుల నుంచి నెలకు రూ.10 వేల వరకు సంపాదిస్తున్నారు. సిరిసిల్లలో అపెరల్‌పార్క్ ఏర్పాటుతో మహిళల జీవితాల్లో అనేక మార్పులు వచ్చాయి. రెడీమేడ్ వస్త్రాల తయారీ యూనిట్‌లో పనిచేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో దాదాపు 500 మంది వరకు మహిళలు ఉపాధి పొందుతున్నారు. అరకొర ఆదాయంతో గడ్డు రోజులు గడిపిన వీరు.. నేడు మెరుగైన వేతనాలతో ఆనందంగా జీవిస్తున్నారు.



వస్త్రాల కటింగ్



రెడీమేడ్ వస్త్రాల నాణ్యతను పరిశీలిస్తున్న మహిళలు



ఈమె సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన అక్షయ. పదో తరగతి వరకు చదువుకుంది. భర్త భాస్కర్ వార్పర్‌గా వస్త్రపరిశ్రమలో పనిచేస్తారు. అక్షయ బీడీలు చేస్తూ తీరిక వేళల్లో మిషన్ కుడుతూ నెలకు రూ.4వేల వరకు సంపాదించేది. సిరిసిల్ల శివారులోని అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాల తయారీ యూనిట్ ప్రారంభం కావడంతో అక్కడ ట్రైనర్‌గా జాయిన్ అయింది. 15 రోజుల పాటు బెంగళూర్‌లో శిక్షణనిచ్చారు. ఇప్పుడు సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ నెలకు రూ.10,300 సంపాదిస్తుంది.



ఈమె సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన బింగి కావ్య. పదో తరగతి వరకు చదివింది. భర్త విష్ణు పవర్‌లూమ్ కార్మికుడు. వీరికి ఇద్దరు అమ్మాయిలు. కావ్య గతంలో బీడీలు చేయగా నెలకు రూ.3వేలు వచ్చేవి. ఏడాదిన్నరగా అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాలను కుడుతూ నెలకు రూ.7,500 సంపాదిస్తుంది.



మిషన్ కుడుతున్న ఈమె బదుగు ప్రణయ. సిరిసిల్ల శివారులోని పెద్దూరుకు చెందిన ఈమె కరీంనగర్ ఉమెన్స్ కాలేజీలో బీఎస్సీ చదివింది. ఇంటి వద్ద ఖాళీగా ఉంటుండగా అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాల తయారీ యూనిట్ పడింది. అక్కడ జూకీ మిషన్‌పై కుట్టు నేర్చుకుని చేరింది. నెలకు రూ.7వేల వరకు వస్తున్నాయి. ఆమె భర్త నాగరాజు కూడా ఇక్కడే పనిచేస్తారు. ఆయనకు రూ.15వేలు వస్తాయి.



రెడీమేడ్ వస్త్రాలను ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

సిరిసిల్ల టు అమెరికా

పెద్దూరు వద్ద 60 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అపెరల్ పార్క్‌లో గతేడాది గోకుల్‌దాస్ ఇమేజెస్ గార్మెంట్ సంస్థ తొలి యూనిట్‌ను ప్రారంభించింది. గ్రీన్‌నీడిల్ పేరుతో రెడీమేడ్ వస్త్రాలను తయారీ చేస్తుంది. ప్రస్తుతం 400 మంది మహిళలు ఉపాధి పొందుతుండగా.. మరో 60 మంది అనుబంధంగా పనిచేస్తున్నారు. ఇంకో వెయ్యి మందికి పని కల్పించే లక్ష్యంతో యూనిట్‌ను విస్తరిస్తున్నారు. ఇక్కడ నిత్యం 5 వేల నుంచి 10 వేల వరకు లోదుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ లోదుస్తులు వివిధ కంపెనీల పేర్లతో ముంబైకి, అక్కడి నుంచి అమెరికాకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ తయారైన వస్త్రాలు వాల్‌మార్ట్, అమెజాన్ వంటి సంస్థల ద్వారా ప్రపంచస్థాయికి ఎగుమతి కావడం విశేషం. రాష్ట్ర మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు ప్రత్యేక చొరవతో అపెరల్‌పార్క్ కార్యరూపం దాల్చింది. ఇంకా మరిన్ని యూనిట్ల నిర్మాణాలు సాగుతున్నాయి. అవి పూర్తయితే జిల్లాలో మహిళల ఉపాధికి కేరాఫ్‌గా అపెరల్ పార్క్ మారనుంది.

ఉచితంగా బస్సు సౌకర్యం

సిరిసిల్ల, వేములవాడ, జిల్లెల్ల, ఎల్లారెడ్డిపేట మార్గాల్లో ఐదు బస్సులను గ్రీన్‌నీడిల్ సంస్థ ఏర్పాటు చేసింది. ఆ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తూ పనిచేస్తున్నారు. యూనిట్‌లోనే క్యాంటిన్ ఏర్పాటు చేశారు. ఉచితంగానే భోజన వసతి కల్పించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు.. రెండు షిఫ్ట్‌ల్లో రెడీమేడ్ వస్త్రాల తయారీ జరుగుతోంది. చిన్నపిల్లలు ఆడుకోవడానికి కేర్‌సెంటర్, వాష్‌రూమ్స్, రెస్ట్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మహిళా వాచ్‌మెన్లు ఉన్నారు. అనుమతి లేకుండా ఒక్కరిని కూడా లోనికి ప్రవేశించనీయరు. కొత్త వారికి 15 రోజులపాటు శిక్షణనిచ్చి పని కల్పిస్తున్నారు.

యూనిట్‌ను విస్తరిస్తాం



మా దగ్గర ప్రస్తుతం 400 మంది మహిళలు పనిచేస్తున్నారు. ఒక్కొక్కరు రూ.8,300 నుంచి రూ.11వేల వరకు వేతనాలు పొందుతున్నారు. ఇంకా యూనిట్‌ను విస్తరించాలని సంస్థ భావిస్తోంది. వెయ్యి మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో సిరిసిల్ల యూనిట్‌ను విస్తరించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇక్కడ మహిళలు కష్టపడి, ఇష్టంగా పనిచేస్తున్నారు. యూనిట్ బాగా నడుస్తోంది.

– మధుకుమార్, గోకుల్‌దాస్ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్

మరిన్ని వస్తున్నాయి



అపెరల్ పార్క్‌లోకి మరిన్ని యూనిట్లు వస్తున్నాయి. ప్రస్తుతం గోకుల్‌దాస్ సంస్థ పనిచేస్తుండగా.. టెక్స్‌పోర్ట్ అనే మరో సంస్థ రెండు మూడు నెలల్లో వస్తుంది. ఇది పూర్తయితే రెండు వేల మంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. గార్మెంట్ రంగంతో మెరుగైన బతుకుదెరువు దరి చేరుతుంది.

– వి.అశోక్‌రావు, ఆర్‌డీడీ చేనేత, జౌళిశాఖ

న్యూస్‌రీల్

రమణకు మంత్రుల పరామర్శ



నివాళి అర్పిస్తున్న మంత్రులు, అధికారులు

జగిత్యాల: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్.రమణ తండ్రి ఎల్జీరామ్ ఇటీవల మృతిచెందగా మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దివాకర

జగిత్యాల: అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా బదిలీపై వచ్చిన దివాకర శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గోదావరికి వరద



పుష్కరఘాట్లను తాగిన గోదావరి నీళ్లు

ధర్మపురి : ఎగువన కురుస్తున్న వర్షాలతో ధర్మపురి గోదావరిలోకి వరద వచ్చి చేరుతోంది. శనివారం పుష్కరఘాట్లను తాకింది.

ఇస్రో చైర్మన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



వేడుకల్లో ప్రతినిధులు

జగిత్యాలటౌన్: చంద్రయాన్‌– 3 విజయవంతం కావడంపై ఇస్రో చైర్మన్ సోమనాథ్ చిత్రపటానికి శనివారం జిల్లా కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. భారత్ సురక్షా సమితి సభ్యుల ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. స్థానిక తహసీల్ చౌరస్తాలో జరిగిన వక్తలు మాట్లాడుతూ, ప్రపంచంలోనే అరుదైన చంద్రయాన్‌– 3 ప్రయోగానికి అండగా నిలిచిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. సభ్యులు ఏసీఎస్ రాజు, అక్కినపెల్లి కాశీ నా థం, సింగం గంగాధర్, సిరిపురం గంగారాం, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

నేడు మంత్రి కేటీఆర్ రాక

జగిత్యాల: ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.30గంటలకు జిల్లాకు చేరుకుని.. ఎమ్మెల్సీ ఎల్.రమణ నివాసానికి వెళ్తారు. ఇటీవల మరణించిన రమణ తండ్రి ఎల్జీరామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తారు. రమణ కుటుంబాన్ని పరామర్శిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నివాసానికి చేరుకుంటారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

91 మంది ఎస్సైల బదిలీ

జగిత్యాలక్రైం: బాసర మల్టీజోన్‌–1లో పనిచేస్తున్న 91 మంది ఎస్సైలను బదిలీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో పలు జిల్లాలు, కమిషనరేట్లకు వారిని బదిలీ చేస్తూ మల్టీజోన్‌–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాల డీఎస్బీలో పనిచేస్తున్న సంజీవ్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు, జగిత్యాల టౌన్ ఎస్సైగా పనిచేస్తున్న అబ్దుల్ రహీం, వీఆర్‌లో పనిచేస్తున్న జి.సందీప్ నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో పనిచేస్తున్న సీహెచ్.సుధీర్‌రావు, ఎల్.రాము, జి.మనోహర్ రావు, డీఎస్బీలో పనిచేస్తున్న ఎల్లయ్యను నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. అలాగే నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి టి.నర్సింహులు, జి.రాజు, ఇంద్రకరణ్‌రెడ్డి, శ్యామ్‌కుమార్‌లు జగిత్యాలకు బదిలీ అయ్యారు. వీరంతా ఒకేచోట మూడు సంవత్సరాలు పనిచేయడంతో బదిలీ అయ్యారు.

అమ్మా.. ఆరోగ్యం బాగుందా..

- బిడ్డ ఆరోగ్యం ఎలా ఉంది?
- తల్లీబిడ్డలను ఆప్యాయంగా పలకరించిన మంత్రి
- మాతాశిశు సంరక్షణ కేంద్రం ఆకస్మిక తనిఖీ
- విధుల్లో నిర్లక్ష్యంపై వైద్యులకు మెమోలు
- జిల్లాలో హరీశ్‌రావు ఆకస్మిక పర్యటన



బాలింతను పలకరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

జగిత్యాల: 'అమ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది.. శిశువు ఆరోగ్యం బాగుందా.. వైద్య సేవలు బాగా అందుతున్నాయా.. వైద్యులు, సిబ్బంది మంచిగ చూస్తున్నారా..' అని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు స్థానిక మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని బాలింతలు, గర్భిణులను పలుకరిస్తూ ముందుకు సాగారు. 'వైద్యులు ఉన్నా.. లేనట్లే' శీర్షికన ఈనెల 7న 'సాక్షి'లో కథనం ప్రచురితమైతంది. ఇది మంత్రి దృష్టికి వెళ్లడంతో తీవ్రంగా పరిగణించారు. ఇటీవల జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వైద్యులతో నేరుగా మాట్లాడారు. పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. శనివారం మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. తల్లీబిడ్డల ఆరోగ్యంపై ఆరా తీశారు. మందులు ఇక్కడే ఇస్తున్నారా? బయట కొనుగోలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు. వైద్యం బాగుందని కొందరు పేషెంట్లు తెలిపారు. అయితే, వైద్యంలో లోపాలు, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు.

వైద్యులతో సమావేశం

ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులతో మంత్రి హరీశ్‌రావు సమావేశమయ్యారు. సమయపాలన పాటించని, ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో లేనిడాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, సూపరిండెంట్‌కు ఆదేశాలు జారీచేశారు. అనధికారికంగా లీవ్‌లు పెట్టిన వారిని మందలించాలన్నారు. బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌తో ఫోన్లో మాట్లాడారు. లీవ్ విషయంపై తీశారు. ఆస్పత్రిలోనే ఉండి విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా, డీఎంహెచ్‌వో శ్రీధర్, వైద్యులు పాల్గొన్నారు.

మంత్రి హడావుడి పర్యటన

మంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్సీ రమణను పరామర్శించాక మాతా శిశు సంక్షేమ కేంద్రంలో తనిఖీ చేశారు. ఎమ్మెల్యేలు, అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఆయన తనిఖీలు చేశారు. మంత్రి వచ్చారని తెలుసుకున్న ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు హుటాహుటిన మాతాశిశు సంక్షేమ కేంద్రానికి చేరుకున్నారు. కాగా, తమకు వేతనాలు పెంచాలని ఆరోగ్య మిత్రలు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

సర్వీసలు క్రమబద్ధీకరించాలి

జగిత్యాలటౌన్: షరతులు లేకుండా తమ సర్వీసు క్రమబద్ధీకరించాలని రెండో ఏఎన్‌ఎంలు మంత్రికి విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారు.

పచ్చదనం పెంపు కోసమే హరితహారం

- రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్

కొండగట్టు(చొప్పదండి): పచ్చదనం పెంపొందించి, పర్యావరణ సమతుల్యం కాపాడటమే హరితహారం లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. ఆరోవిడత గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లోని 1,094 ఎకరాలు దత్తత తీసుకొని శనివారం మొక్కలు నాటారు. సీఎస్ శాంతకుమారి, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి తొలుత అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జేఎన్టీయూ రిజర్వు ఫారెస్ట్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ, అంజన్న భక్తులకు ఆహ్లాద వాతావరణం ఉండేలా ఎంపీ కోటా నుంచి రూ.104.85లక్షలు వెచ్చించి అటవీ ప్రాంతానికి రక్షణ కంచె, వాకింగ్ ట్రాక్, వాచ్ టవర్ తదితర నిర్మాణాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, కలెక్టర్ యాస్మిన్ బాషా, పీసీసీఎఫ్ దోబ్రియల్, సీఎం సెక్రటరీ భూపాల్‌రెడ్డి, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, డీఎఫ్‌ఓ బీవీరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సంతోష్‌కుమార్ తదితరులు

ఎంపీ సంతోష్‌కు శుభాకాంక్షలు

జగిత్యాల: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దర్శనం కోసం వచ్చిన రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

క్లుప్తంగా

నీటిని వృథా చేయొద్దు

● జగిత్యాల మున్సిపల్ చైర్మన్ నరేశ్


మాట్లాడుతున్న చైర్మన్ నరేశ్

జగిత్యాల: నీటిని వృథా చేయొద్దని మున్సిపల్ చైర్మన్ నరేశ్ అన్నారు. నీటి వినియోగం, పారిశుధ్యం, పరిశుభ్రత అంశాలపై ఏపీ మాస్, మెప్మా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని, నీటిని అవసరం మేరకే వినియోగించుకోవాలని సూచించారు. టాయిలెట్స్ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. టాయిలెట్స్ నిర్మాణం, మరమ్మతు, తాగునీటి సౌకర్యాలకు ఏపీ మాస్ సంస్థ నుంచి రుణం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో డీఈ రాజేశ్వర్, ఏపీ మాస్ ప్రతినిధి బ్రహ్మచారి, మెప్మా టీఎంసీ రజిత తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లకు తరలుతున్న రేషన్ బియ్యం


బైక్‌పై రేషన్ బియ్యం తరలిస్తున్న దృశ్యం

కథలాపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో పలువురు బైక్‌లపై తిరుగుతూ రేషన్ బియ్యం సేకరిస్తున్నారు. అనంతరం కోరుట్ల పట్టణానికి తరలిస్తున్నారు. లబ్ధిదారుల వద్ద కిలో బియ్యాన్ని రూ.10 చొప్పున కొనుగోలు చేస్తున్నామని చెప్పడం విశేషం. రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు దృష్టిసారిస్తే రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్ట వేయవచ్చని ప్రజలు అంటున్నారు.

గిరినార్ పర్వతంపై సూర్య నమస్కారాలు

మెట్‌పల్లి(కోరుట్ల): వెల్లుల్లకు చెందిన మరిపెల్లి ప్రవీణ్ గుజరాత్‌లోని గిరినార్ పర్వతంపై సూర్య నమస్కారాలు చేశారు. సముద్ర మట్టానికి 3,672 అడుగుల ఎత్తులో ఉన్న ఈ పర్వతంపై 16సెకన్లలో 108 సూర్య నమస్కారాలు చేశారు. గతంలో ప్రపంచంలోని ఎత్తయిన 27 పర్వతాలపై ఆయన సూర్య నమస్కారాలు చేసి ప్రశంసలు అందుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): టాస్క్‌ఫోర్స్ పోలీసులు 32 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్సై మారుతి తెలిపిన వివరాల ప్రకా రం.. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ముస్తాబాద్ మండలంలోని నామాపూర్‌లో శనివారం తెల్లవారుజామున పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన రెండు వాహనాల్లో బి య్యం తరలిస్తూ నామాపూర్‌వాసులు కడమంచి గట్టయ్య, పర్వతం సంతోష్, దుబ్బాక మండలంలోని పెద్దచీకోడుకు చెందిన చౌడ శ్రీకాంత్, ఎల్లారెడ్డిపేటకు చెందిన కడమంచి కనకయ్య పట్టుబడ్డారు. తదుపరి చర్యల నిమిత్తం వారితోపాటు బియ్యం ఉన్న వాహనాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

బీమా.. అన్నదాతకు ధీమా

● రైతుబంధు పథకానికి కొత్త రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
● ఆగస్టు 5 వరకు గడువు
● జిల్లాలో 18 వేల మందికి పైనే..


సాగులో డ్రమ్‌సీడర్ వినియోగిస్తున్న రైతు (ఫైల్)

పెగడపల్లి(పెగడపల్లి)/జగిత్యాల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం మరణించిన రైతు కుటుంబాలకు అండగా నిలుస్తోంది. ఇందులో కొత్త రైతులను చేర్చుకునేందుకు సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు ఈ ఏడాదికి కొత్తగా అర్హులైనవారు పేరు నమోదు చేసుకోవడంతోపాటు ప్రస్తుతం ఉన్న లబ్ధిదారుల వివరాల్లో మార్పు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. 2018 ఆగస్టు 15న ఈ పథకం అమల్లోకి వచ్చింది. మృతుడి నామినీకి రూ.5 లక్షలు బీమా వర్తించేలా నిర్ణయించారు. రైతు మృతిచెందితే వ్యవసాయ అధికారులు నామినీ ఖాతాలో పరిహారం జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. మొదట రెండేళ్లపాటు ఎప్పటికప్పుడు దరఖాస్తులు స్వీకరించారు. 2020 నుంచి ఏటా వానాకాలంలో ఒకసారి మాత్రమే తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 10 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ పథకంలో రైతు పేరిట ప్రభుత్వం బీమా కంపెనీకి రూ.3,457 చెల్లిస్తోంది.

3,476 మంది రైతుల మృతి..

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 2018లో 97,673 మంది రైతులు పేరు నమోదు చేసుకోగా 572 మంది మృతి చెందారు. వీరి కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున రూ.28.6 కోట్ల పరిహారం చెల్లించింది. 2019లో 1,04,263 మంది నమోదు చేసుకుంటే 603 మంది మృతిచెందగా రూ.30.15 కోట్లు, 2020లో 1,04,751 మంది నమోదు చేసుకుంటే 970 మంది మృతి చెందగా రూ.48.5 కోట్లు, 2021లో 1,17,524 మంది నమోదు చేసుకుంటే 754 మంది రైతులు మృతి చెందగా రూ.37.7 కోట్లు, 2022లో 1,24,285 మంది రైతులు నమోదు చేసుకోగా 577 మంది మృతిచెందితే 518 మందికి రూ.25.9 కోట్ల బీమా సాయాన్ని మృతుల కుటుంబాలకు అందించింది. రైతు చనిపోతే కుటుంబసభ్యులు స్థానికంగా ఉన్న వ్యవసాయ అధికారులకు సమాచారం ఇస్తే చాలు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, పరిహారం మంజూరుకు కృషి చేస్తారు.

జూన్ 18 వరకు పొందినవారు..

జూన్ 18వ తేదీ వరకు భూములు కొనుగోలు చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. జిల్లాలో నూతనంగా పట్టా పుస్తకాలు పొందినవారు 18 వేల మందికి పైనే ఉన్నట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో 18 నుంచి 60 ఏళ్లలోపు వయసున్నవారు అర్హులని సర్కారు తెలిపింది. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లను దరఖాస్తుకు జతచేసి, నామినీ పేరును పేర్కొంటూ వారి ఆధార్ కూడా జత చేసి, వ్యవసాయ విస్తరణాధికారికి అందించాల్సి ఉంటుంది.

మార్పులుంటే చేసుకోండి



రైతుబీమా పథకంలో కొత్తవారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు ఏమైనా మార్పులు చేసుకోవాలి. ఈ పథకం అమలు, విధివిధానాలు, అర్హత తదితర అంశాలపై ఏఈవోలు గ్రామాల్లో అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి.
– సురేశ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

విప్లవ భావాలకు అనుగుణంగా వివాహం

● పెళ్లిరోజు వేడుకల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి: 'విప్లవ ఉద్యమంలో పనిచేసిన నాకు.. విప్లవ భావాలతోనే వివాహం జరిపించారు. మాది ప్రేమ వివాహం కాదు..' అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ – స్నేహలత దంపతుల వివాహ వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. పది సంవత్సరాలపాటు విప్లవ ఉద్యమంలో పనిచేసిన తనకు పిల్లను ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాలేదన్నారు. చివరకు ప్రేమలత తల్లిదండ్రులు ధైర్యం చేసి ముందుకు రావడంతో విప్లవ మహాసభ జరుగుతున్న సందర్భంలోనే తనకు వివాహం నిశ్చయించారని తెలిపారు. వివాహానికి ముందు, తర్వాత అనేక కష్టాలు అనుభవించానని గుర్తుచేసుకున్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీసింహుని దయ, అమ్మవారి ఆశీస్సులతో ఇంతవాడినయ్యానని ఆనందం వ్యక్తం చేశారు. కష్టాల నుంచి వచ్చిన వాడినని, ప్రజల కష్టసుఖాల గురించి పూర్తిగా తెలుసని చెప్పారు. ఎన్ని పదవులు వచ్చినా.. ప్రజల ఆదరాభిమానాలను మరువలేనివని స్పష్టం చేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా ప్రజాసేవ చేశానని, ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయనని, ప్రజలే దేవుళ్లుగా భావిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఉపాధ్యక్షుడు రామన్న, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న శ్రావణి

జగిత్యాల: స్థానిక మాతా శిశు సంక్షేమ ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి డిమాండ్ చేశారు. శనివారం ఆమె ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు మాతా శిశు సంక్షేమ కేంద్రాన్ని సందర్శించినప్పుడు వైద్యులు అందుబాటులో లేకపోవడం విడ్డూరమన్నారు. ప్రజల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్కలేదని విమర్శించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

● కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: రక్తహీనత, పోషకాహార లోపం తదితర సమస్యలతో చిన్నారులు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. ఈనెల 20న జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. 1–19ఏళ్ల వయసులోపు వారికి వైద్యుల సలహా మేరకు అల్బెండజోల్ మాత్రలు అందించాలన్నారు. అధికారులు గ్రామాల్లో, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీధర్, డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి సాయిబాబా పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్లాపూర్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ జనసమితి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు దిలీప్ డిమాండ్ చేశారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్వోలో విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఎంఐఎస్‌సీ ప్రతాప్‌కి నియోజకవర్గ అధ్యక్షుడు రాంపెల్లి శ్యాంకుమార్‌తో కలిసి వినతిపత్రం అందించారు. స్వరాష్ట్రంలో కేజీ టు పీజీ నాణ్యమైన విద్యనందిస్తామన్న సీఎం కేసీఆర్ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించడం లేదని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రైవేటు విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని తెలిపారు. అవి విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడం లేదని, విద్యను వ్యాపార వస్తువుగా మార్చాయన్నారు. అధిక ఫీజులు తీసుకుంటున్నాయని, విద్యాసంస్థల్లోనే పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్నులు విక్రయిస్తున్నాయని తెలిపారు. వాటిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. పార్టీ నియోజవకర్గ యువజన అధ్యక్షుడు వన్నెల శశికుమార్, ప్రధాన కార్యదర్శి మ్యాన సతీశ్, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు కంతి రమేశ్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కేశపాక తరుణ్, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ రాకతో.. అంజన్న భక్తుల నిరీక్షణ


క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆలయానికి శనివారం ఎంపీ సంతోష్‌కుమార్ పలువురు ప్రముఖులు రావడంతో భక్తులు శ్రీఆంజనేయ స్వామి దర్శనానికి 2 గంటలకు పైగా నిరీక్షించారు. అలాగే ఆలయానికి కిలోమీటరు దూరం నుంచి భక్తుల వాహనాలను అనుమతించకపోవడంతో వృద్ధులు, చంటిపిల్లల తల్లులు, దివ్యాంగులు ఇబ్బంది పడ్డారు. వీఐపీలు వచ్చినప్పుడు సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ పట్టణంలో మరో చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదును ఎత్తుకెళ్లారు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన గొట్టె రవీందర్–లక్ష్మీ దంపతులు రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి నామాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ శుభకార్యంలో పాల్గొని శనివారం ఉదయం ఇంటికి చేరుకున్న రవీందర్‌కు తెరిచి ఉన్న తలుపులు కనిపించాయి. వెంటనే ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలోని రూ.60వేలు, ఐదు తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై వెంకటేశ్వర్లు క్లూస్ టీంతో అక్కడికి చేరుకొని ఆధారాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. రవీందర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపకరణాల దరఖాస్తుదారులు 18న హాజరుకావాలి

జగిత్యాల: దివ్యాంగుల ఉపకరణాల దరఖాస్తులను పరిశీలించినట్లు జిల్లా సంక్షేమాధికారి నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు వందశాతం సబ్సిడీపై ఉపకరణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో గత ఏప్రిల్ 26 నుంచి మే 5 వరకు దరఖాస్తులు స్వీకరించామని, వాటి పరిశీలన పూర్తయిందన్నారు. దరఖాస్తుదారులు ఈ నెల 18న ఉదయం 11 గంటలకు జగిత్యాల సమీకృత కార్యాలయంలో హాజరు కావాలన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదెరం ఒరిజినల్ సర్టిఫికెట్ వెంట తీసుకురావాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిజామాబాద్‌కు చెందిన పాటి నాగరాజు(25) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. నిజామాబాద్‌కు చెందిన పాటి మొండయ్య–మల్లవ్వ కుమారుడు నాగరాజు వేములవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. తండ్రి మొండయ్య రెండేళ్ల క్రితం మృతిచెందగా తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈనెల 12న డ్యూటీకి వెళ్తున్నాని చెప్పిన నాగరాజు తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తల్లి మల్లవ్వ కోనరావుపేటలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శనివారం నిజామాబాద్ శివారులోని పందిగుట్ట ప్రాంతంలో నాగరాజు శవం కనిపించింది. సంఘటన స్థలంలో పురుగుల మందు డబ్బా కనిపించడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుని తల్లి మల్లవ్వ ఫిర్యాదుతో ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జగిత్యాల డీఎస్పీ బదిలీ

జగిత్యాలక్రైం: జగిత్యాల డీఎస్పీ రత్నాపురం ప్రకాశ్‌ను బదిలీ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. హైదరాబాద్‌లోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే, జగిత్యాల డీఎస్పీగా ఖమ్మం నుంచి ఎన్.వెంకటస్వామిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

గోధూర్‌లో మహిళ దారుణ హత్య

● పుస్తెలు, కమ్మల కోసమే..
● మక్క చేనులో కలుపు తీస్తుండగా దుండగుల ఘాతుకం
● తలపై బండతో మోది చంపినట్లు ఆనవాళ్లు


మక్క చేనులో నర్సు మృతదేహం

ఇబ్రహీంపట్నం: మక్క చేనులో కలుపు తీసేందుకు వెళ్లిన ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన ఇబ్రహీంపట్నం మండలంలోని గోధూర్‌లో కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. గోధూర్‌కు చెందిన మహిళా రైతు మెట్టు నర్సు(55)ను ఆమె కుమారుడు సాగర్ శనివారం ఉదయం బైక్‌పై తీసుకెళ్లి, తమ మక్క చేను వద్ద దింపాడు. తర్వాత అతను వెళ్లిపోయాడు. సాయంత్రం 5 గంటలైనా తల్లి ఇంటికి రాకపోవడంతో సాగర్ చేను వద్దకు వెళ్లాడు. భారీ వర్షం పడుతుండటంతో తల్లి ఇంటికి వెళ్లి ఉంటుందని భావించి, సరిగా గమనించకుండానే తిరిగివెళ్లాడు. రాత్రి 7 గంటలు దాటుతున్నా ఇంటికి చేరకవడంతో మరోసారి చేను వద్దకు వెళ్లి పరిశీలించగా ఆమె మృతదేహం కనిపించింది. నర్సు తలపై బండతో మోది చంపినట్లు ఆనవాళ్లు ఉండటంతోపాటు మెడలో పుస్తెలు, చెవుల కమ్మలు లేకపోవడంతో ఆందోళన చెంది, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై ఉమాసాగర్‌లు సంఘటన స్థలానికి వెళ్లి, పరిశీలించారు. మృతురాలి భర్త పెద్ద భూమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా


జరిమానా చెల్లిస్తున్న రాజేశం

జగిత్యాలక్రైం: బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాయికల్‌కు చెందిన కలమడుగు రాజేశం నాటుసారా విక్రయిస్తున్నాడన్న అనుమానంతో పోలీసులు గతేడాది డిసెంబర్‌లో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి 23.06.2023న నాటుసారా విక్రయిస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డాడు. పోలీసులు శనివారం అతన్ని జగిత్యాల రూరల్ తహసీల్దార్, రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ నవీన్ ఎదుట ప్రవేశపెట్టారు. ఆయన రూ.లక్ష జరిమానా విధించగా చెల్లించాడని ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో బైండోవర్ అయిన వ్యక్తులు నిబంధనలు ఉల్లంఘిస్తే ఏడాది జైలుశిక్ష లేదా రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు.

కాంగ్రెస్ వస్తేనే నిరుద్యోగులకు న్యాయం

● యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి


యాత్రలో శివసేనారెడ్డి, నాయకులు

మెట్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన యువ పోరాట యాత్ర శనివారం మెట్‌పల్లికి చేరింది. స్థానిక అయ్యప్ప ఆలయం వద్ద శివసేనారెడ్డి, ఇతర నాయకులకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి పాదయాత్రకు పాత బస్టాండ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులకు రూ.3 వేల భృతి చెల్లిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్ ఇంతవరకు నిలబెట్టుకోలేదన్నారు. ఉద్యోగ ఖాళీలన్నింటినీ భర్తీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఖాళీలను భర్తీ చేస్తుందని హామీ ఇచ్చారు. మూసివేసిన ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని తెరుస్తామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దివంగత కొమొరెడ్డి రాములు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది కొమొరెడ్డి కరమ్, విజయ్‌ఆజాద్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామ్రాట్ వంశీ, జిల్లా అధ్యక్షుడు మధు, నాయకులు వాకిట సత్యంరెడ్డి, అల్లూరి మహేందర్‌రెడ్డి, ఎర్రోళ్ల హన్మాండ్లు, యామ రాజయ్య, షాకీర్, రైసొద్దీన్, మహిపాల్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

● సోదరి ఇంట్లో శుభకార్యానికి హాజరై వస్తుండగా ఘటన


హరికృష్ణ మృతదేహం

జగిత్యాల క్రైం: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సారంగాపూర్ మండలంలోని బట్టపల్లి పోతారం గ్రామానికి చెందిన దేశరాజు హన్మాండ్లు–నందవ్వల కుమారుడు హరికృష్ణ(19) శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలోని తన సోదరి ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యాడు. అర్ధరాత్రి బైక్‌పై స్వగ్రామం వెళ్తుండగా జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ వద్ద మెట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో హరికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బావ రాజు ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ బందెల మొండయ్యపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. కాగా, మృతుడి తండ్రి ఏడాదిన్నర క్రితమే గుండెపోటుతో మృతిచెందాడు. ఇప్పుడు హరికృష్ణ మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ధర్మపురి మార్కెట్ అభివృద్ధికి నిధులివ్వండి

● రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డిని కోరిన డీసీఎంఎస్, ఏఎంసీ చైర్మన్లు


వినతిపత్రం ఇస్తున్న చైర్మన్లు శ్రీకాంత్‌రెడ్డి, రాజేశ్

ధర్మపురి: ధర్మపురి వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులివ్వాలని ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, డీసీఎమ్మెస్ ఉమ్మడి కరీంనగర్‌జిల్లా చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డిలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెట్ ఆవరణలో చేపట్టనున్న చైర్మన్ చాంబర్ గది, సీసీ ప్లాంటేషన్, మరుగుదొడ్లు, నీటి నిల్వ సంపు, కాంపౌండ్ వాల్ తదితర పలు పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కాసారపు రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్రవాహనం

● యువకుడి మృతి
● మరొకరికి గాయాలు


విజయ్ సాద్ (ఫైల్)

మల్లాపూర్: ద్విచక్రవాహనం చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడు గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన విజయ్ సాద్(26), బీర్ సాద్ ఉపాధి నిమిత్తం మల్లాపూర్ మండలంలోని వీవీరావుపేట్‌లో స్థిరపడ్డారు. గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి సామగ్రి కోసం బైక్‌పై మల్లాపూర్ వచ్చి, తిరిగి వెళ్తున్నారు. గొర్రెపల్లి దాటాక అతివేగంగా వాహనం నడిపి, చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే విజయ్ సాద్ మృతిచెందాడని వైద్యులు తెలిపారు. బీర్ సాద్ చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నవీన్ పేర్కొన్నారు.

108, 102 ఈఎంటీ, పైలట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మల్యాల: 108, 102 వాహనాల్లో ఈఎంటీ, పైలట్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాని ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటీ ఉద్యోగానికి వయసు 30 ఏళ్లలోపు ఉండి, డిగ్రీ బీఎస్సీ బీజెడ్‌సీ లేదా లైఫ్ సైన్స్ ఉత్తీర్ణులై, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, ఎంఎల్‌టీలలో ఏదైనా కోర్సు చేసినవారు, పైలట్ పోస్టుకు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఎల్‌ఎంవీ బ్యాడ్జీ లేదా హెవీ లైసెన్స్ కలిగి ఉండి, 33 ఏళ్లలోపు వయసు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17న జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 73309 29681, 91212 45183 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.